సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 24 । జనవరి । 2025



పట్టణవాసులకూ అందేలా..

పట్టణాల్లోని రైతు కూలీలకూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందేలా చూస్తానని పోచారం హామీ ఇచ్చారు.

- IIలో ▸



డాటా ఎంట్రీని వేగంగా చేపట్టాలి

పథకాలకు సంబంధించిన డాటా ఎంట్రీని వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సంగ్వాన్ సూచించారు.

- IIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.8 /11.0

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొన సాగుతుంది.

న్యూస్‌రీల్

భోజనంలో నాణ్యత పాటించాలి



డిచ్‌పల్లి: గురుకుల పాఠశాలల్లో భోజనం విషయంలో నాణ్యత ప్రమాణాలు విస్మరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి యోగితారాణా హెచ్చరించారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం (బి) గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను ఆమె గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులకు బోధన పద్ధతులు, అధ్యాపకుల తీరును సమీక్షించారు. పాఠశాలలో వసతులు, బోధనపై సమీక్షించారు. కళాశాల స్థాయిలో ప్రయోగశాలల నిర్వహణ, సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్, డీఈవో అశోక్, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత, సూపరిండెంట్ రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

డీఈవోకు సమ్మె నోటీస్



కామారెడ్డి టౌన్: డిమాండ్ల సాధన కోసం మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులు ఆందోళన బాటపడుతున్నారు. ఈనెల 28వ తేదీన టోకెన్ సమ్మె చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు గురువారం డీఈవో రాజుకు నోటీస్ ఇచ్చారు. ప్రభుత్వం తమకు చెల్లిస్తున్న మార్కెట్ ధరలకు అనుగుణంగా స్లాబ్ మార్చాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రపాణి, ఎండీఎం కార్మికులు సోఫియా, సంగీత, సిద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



మాచారెడ్డి: విద్యార్థులు కష్టపడి చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం సూచించారు. గురువారం మాచారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులు, కళాశాలకు పేరు తేవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ యాకినొద్దీన్, అధ్యాపకులు నర్సింలు, రామకృష్ణ, జయంత్ తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: జిల్లాలోని వికలాంగులకు జీవనోపాధి అవకాశాలు కల్పించడం కోసం 28 యూనిట్లు మంజూరయ్యాయని జిల్లా సంక్షేమాధికారి ఏ.ప్రమీల ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకులతో సంబంధం లేకుండా వంద శాతం రాయితీతో రూ. 50 వేల రూపాయల చొప్పున అందిస్తామని పేర్కొన్నారు. ఐదేళ్లలో ఎలాంటి రాయితీ పొందని దివ్యాంగులు వచ్చేనెల 2వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బాల్యానికి మూడుముళ్లు!



■ కొన్నాళ్ల క్రితం రాజంపేట మండలంలోని ఓ తండాలో బాలికకు పెళ్లి చేస్తున్నారని 1098 నంబర్‌కు ఫిర్యాదు అందింది. దీంతో బాలల పరిరక్షణ విభాగం అధికారులు పోలీసులతో కలిసి వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. చిన్న వయసులో పెళ్లి చేస్తే ఎదురయ్యే ఇబ్బందులను వివరించారు. దీంతో మైనారిటీ తీరేంతవరకు పెళ్లి చేయబోమని బాలిక తల్లిదండ్రులు ఒప్పుకున్నారు. అయితే అధికారులు వెళ్లగానే.. రాత్రికి రాత్రే రహస్యంగా వివాహం జరిపించేశారు. విషయం తెలుసుకున్న అధికారులు పూజారితోపాటు పెళ్లికి హాజరైన పది మందిపై పోలీసు కేసు నమోదు చేయించారు. వధువుకు బాలసదనంలో తాత్కాలిక వసతి కల్పించారు.

■ గతేడాది లింగంపేట మండలంలో ఓ మారుమూల గ్రామంలో మైనర్ల ప్రేమ వ్యవహారం తెలిసిన కుటుంబ సభ్యులు బలవంతపు పెళ్లి చేశారు. సామాజిక మాధ్యమాల్లో పెళ్లికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను చూసిన చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు రంగంలోకి దిగారు. పెళ్లి చేసిన కుటుంబ సభ్యులు, బంధువులు మొత్తం 14 మందిపై కేసు నమోదు చేశారు. బాలికకు కొంతకాలం బాలసదనంలో వసతి కల్పించారు. తర్వాత కేజీబీవీలో ఎనిమిదో తరగతిలో చేర్పించారు.

వద్దంటున్నా వినని పెద్దలు..

అప్పుడే పెళ్లి వద్దంటూ చాలా చోట్ల అమ్మాయిలు నిరాకరిస్తున్నారు. తాము చదువుకుంటామని మొత్తుకుంటున్నారు. అయితే కన్నవారు వారిపై తీవ్రమైన ఒత్తిళ్లు తీసుకువచ్చి మరీ వివాహం జరిపిస్తున్నారు. ఇలాంటి సమయాల్లో కొందరు బాలికలు అధికారులకు సమాచారం ఇస్తూ తమను కాపాడాలని వేడుకుంటున్నారు. దీంతో అధికారులు స్పందించి బాలికల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. బాల్య వివాహాలతో భవిష్యత్‌లో తలెత్తే సమస్యలను వివరిస్తూ పెళ్లిళ్లను అడ్డుకుంటున్నారు. అధికారులు జిల్లాలో గతేడాది 55 బాల్య వివాహాలను నిలువరించారు. బాల్య వివాహాలు చేసిన కారణంగా 38 మందిపై కేసులు కూడా నమోదు చేశారు.

ఆడుతూ, పాడుతూ గడపాల్సిన ప్రాయంలో.. చదువులతో ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాల్సిన సమయంలో.. తల్లిదండ్రులు మూడు ముళ్ల బంధంతో ముకుతాడు వేస్తున్నారు. బాల్య వివాహాలతో బరువుకు మించిన బాధ్యతలు మోపుతున్నారు. చిన్న వయసులోనే వివాహాలు జరుగుతుండడంతో చాలామంది శారీరకంగా, మానసికంగా ఇబ్బందిపడుతున్నారు. బాల్య వివాహాలకు చెక్ పెట్టడానికి అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. సరైన అవగాహన లేక వివిధ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరిపిస్తూనే ఉన్నారు. నేడు జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కథనం..

- తప్పని తెలిసినా ఆగని బాల్య వివాహాలు
- ఏడాదిలో 55 పెళ్లిళ్లను అడ్డుకున్న అధికారులు
- ఏడు సంఘటనల్లో 38 మందిపై కేసులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పేదరికం, నిరక్షరాస్యత, ఆర్థికంగా వెనకబాటు, కట్టుబాట్లు తదితర కారణాలతో చాలా కుటుంబాలలో బాల్య వివాహాలు జరుగుతున్నాయి. పేద కుటుంబాల్లో పిల్లల పోషణ భారంగా భావించడం, పెళ్లి చేస్తే కన్నవారిగా తమ బాధ్యత తీరుతుందని పెద్దలు అనుకోవడం, ఒంటరి తల్లి లేదా తండ్రి ఉండే కుటుంబాల్లో అయితే ఆడపిల్లను త్వరగా పెళ్లి చేసి ఓ ఇంటికి పంపించేయాలన్న ఆలోచనలు కనిపిస్తున్నాయి. తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు అనారోగ్యం పాలై కొద్ది రోజుల్లో చనిపోతారని తెలిస్తే చాలు అమ్మాయి వయసుతో సంబంధం లేకుండా వివాహం జరిపించడానికి ప్రయత్నిస్తున్నారు. మారుమూల గ్రామాలు, తండాల్లో ఎక్కువగా బాల్య వివాహాలు జరుగుతున్నట్టు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది.



కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు (ఫైల్)



బాల్య వివాహాన్ని అడ్డుకుంటున్న అధికారులు (ఫైల్)

బాల్యవివాహాలతో అనర్థాలు..

తెలిసీతెలియని వయసులో వివాహాలు జరిపిస్తుండడంతో ముఖ్యంగా బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న వయసులోనే గర్భం దాల్చడం ద్వారా అనేక రకాల ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారు. చాలా మంది రక్తహీనత సమస్యను ఎదుర్కొంటున్నారు. చదువుకోవాల్సిన వయసులో తల్లులైన వారి పరిస్థితి దయనీయంగా మారుతోంది.

“ అవగాహన కల్పిస్తున్నాం



బాల్య వివాహాల వల్ల ఎదురయ్యే ఇబ్బందులపై అవగాహన కల్పిస్తున్నాం. గతేడాది 138 అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. బాల్య వివాహాలు జరుగుతున్నట్టు తెలియగానే తమ సిబ్బంది పోలీసుల సహకారంతో వెళ్లి నిలువరిస్తున్నారు. అయినా కొన్ని చోట్ల బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. అలాంటి సందర్భాల్లో కేసులు నమోదు చేయిస్తున్నాం. బాల్యంలోనే పెళ్లి చేయడం వల్ల బాలికలు మానసికంగా, శారీరకంగా అనేక ఇబ్బందులకు గురవుతారు. తల్లిదండ్రులు తమ బిడ్డ ఆరోగ్యం గురించి ఆలోచించాలి. యుక్త వయసు వచ్చాకే పెళ్లి చేయాలి.

– ప్రమీల, జిల్లా సంక్షేమ అధికారి

పేరుకే రోడ్డు భద్రత

పట్టింపులేని ట్రామా 'కేర్'

- ఏళ్లతరబడి ప్రతిపాదనలకే పరిమితం
- క్షతగాత్రులు గోల్డెన్ అవర్‌ను సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జాతీయ, రాష్ట్ర రహదారులపై చోటుచేసుకునే రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర గాయాలపాలైనవారు ప్రాణాపాయ స్థితి నుంచి తప్పించేందుకు అన్ని ప్రాంతాల్లో ట్రామాకేర్ సెంటర్లు(అత్యవసర సేవల కోసం) నిర్వహించడం తప్పనిసరి. అయితే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో జాతీయ రహదారి మీద, ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ఎక్కడా ట్రామాకేర్ సెంటర్లు లేవు. వీటిని ఏర్పాటు చేయాల్సిన ప్రభుత్వమే ఈ విషయాన్ని గాలికొదిలేసి రోడ్డు భద్రతా వారోత్సవాలు, మాసోత్సవాలు నిర్వహిస్తుండడం గమనార్హం. బాధ్యత గల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సైతం అవగాహన కార్యక్రమాల్లో ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటు విషయం, వాటి ప్రాధాన్యత గురించి మాత్రం మాట్లాడకుండా మొక్కుబడిగా ముగించేస్తున్నారు.

■ రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా తలకు గాయాలై క్షతగాత్రులు మరణిస్తున్నారు. జీరో యాక్సిడెంట్స్ అంటూ నినాదాలు చేస్తూ రహదారి భద్రతా మాసోత్సవాలు, వారోత్సవాల్లో ఉపన్యాసాలిస్తున్న అధికారులు.. ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు సత్వర చికిత్స కోసం ఉద్దేశించిన ట్రామా కేర్ సెంటర్ల గురించి మాత్రం మాట్లాడడం లేదు. ఇందల్వాయి టోల్ ప్లాజా నుంచి సమీపంలో ఉన్న డిచ్‌పల్లి ఆస్పత్రిలో కానీ, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కేంద్రాల్లో ఉన్న ఆస్పత్రుల్లో కానీ ట్రామా కేర్ సెంటర్లు లేవు. ప్రభుత్వ ఆస్పత్రిల్లో ఆర్థో సర్జరీ విభాగమే కాకుండా ప్రత్యేకంగా న్యూరో సర్జరీ, సీటీ స్కాన్, ఐసీయూ, బ్లడ్ బ్యాంక్, రేడియాలజీ విభాగాలతో కూడిన సూపర్ స్పెషాలిటీ వైద్య సదుపాయాలతో ట్రామా కేర్ సెంటర్ తప్పనిసరిగా ఉండాలి. టోల్ ప్లాజాలలో వాహన వినియోగదారుల నుంచి కచ్చితంగా టోల్ చార్జీలు వసూలు చేస్తున్న టోల్ ప్లాజా నిర్వాహకులు సైతం ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

■ జాతీయ, రాష్ట్ర రహదారులకు 30 కిలోమీటర్ల దూరంలోపు ఉండే ప్రభుత్వ ఆస్పత్రుల్లో తప్పనిసరిగా ట్రామా కేర్ సెంటర్లు ఉండాలనే నిబంధనలు ఉన్నాయి. 2017లో రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో 11 చోట్ల ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అయితే అది కార్యరూపం దాల్చలేదు. ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులు, కేంద్ర ప్రభుత్వం 70 శాతం నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. 2017 ప్రతిపాదనల ప్రకారం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. జాతీయ రహదారి మీద ఉన్న ఇందల్వాయి టోల్ ప్లాజా నుంచి నిజామాబాద్‌లోని జీజీహెచ్ 26 కిలోమీటర్ల దూరంలో ఉంది. తలకు గాయమైనవారిని గోల్డెన్ అవర్‌లో ట్రామా కేర్ సెంటర్‌కు తరలించి చికిత్స అందిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చు.

“ జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం..

నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రితో పాటు తెలంగాణలోని అన్ని రాష్ట్ర, జాతీయ టోల్ ప్లాజాల వద్ద ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. లేనిపక్షంలో వాహన వినియోగదారుల సంక్షేమం దృష్ట్యా జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తాం.

– సాంబరాజు చక్రపాణి, వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి

యోగా శిబిరాన్ని విజయవంతం చేయాలి

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ప్రాబెల్స్ హైస్కూల్‌లో వచ్చేనెల 1, 2, 3 తేదీల్లో నిర్వహించే మెగా యోగా శిబిరాన్ని విజయవంతం చేయాలని భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రావు పిలుపునిచ్చారు. గురువారం ఆయన ట్రస్ట్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ నందనం కృపాకర్‌తో కలిసి శిబిరం ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం కార్యకర్తలతో సమావేశమై సూచనలు ఇచ్చారు. హరిద్వార్‌కు చెందిన స్వామి పరమార్థదేవ్ ఈ శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. శిబిరాన్ని విజయవంతం చేయడం కోసం యోగా అభిమానులందరిని కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచించారు. అనంతరం జిల్లా యోగా భవన్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని కలిసి శిబిరానికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో యోగా అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యోగా రాంరెడ్డి, ప్రతినిధులు జి.అంజయ్యగుప్తా, అనిల్‌కుమార్, పి.అంజయ్య, బి.రఘుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న శ్రీధర్‌రావు, ట్రస్ట్ సభ్యులు

మా పేర్లెందుకు లేవు?

- గ్రామసభల్లో నిలదీస్తున్న ప్రజలు
- ఇందిరమ్మ భరోసాలో అనర్హుల పేర్లు ఉన్నాయంటూ ఆగ్రహం
- సమాధానం చెప్పలేక ఇబ్బందులు పడుతున్న అధికారులు

ప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాలకు అర్హులను ఎంపిక చేయడం కోసం నిర్వహిస్తున్న గ్రామ సభలు నిరసనల మధ్య కొనసాగుతున్నాయి. అర్హుల జాబితాలో పేర్లు లేనివారు అధికారులను నిలదీస్తున్నారు. వారికి సమాధానం చెప్పలేక అధికారులు ఇబ్బందిపడుతున్నారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో గురువారం 140 గ్రామాల్లో, అలాగే మున్సిపాలిటీల పరిధిలో 14 వార్డుల్లో సభలు నిర్వహించారు. లబ్ధిదారుల జాబితాలు చదవగానే తమ పేర్లెందుకు లేవంటూ చాలా చోట్ల ప్రజలు అధికారులతో వాదనకు దిగారు. లింగంపేట గ్రామ సభలో రేషన్ కార్డుల జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవంటూ అధికారులను నిలదీశారు. దీంతో సభ రసాభాసగా జరిగింది. బిచ్కుంద గ్రామ సభలో రేషన్‌కార్డుల విషయంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఇరువర్గాలు తోసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని వారిని సముదాయించారు. రామారెడ్డి మండలం ఉప్పల్వాయిలో ఆత్మీయ భరోసా కింద 12 మందిని మాత్రమే ఎంపిక చేసిన జాబితాను చదవగా.. వారిలో అందరికీ భూములున్నాయని, భూములు లేని వారి పేర్లు మాత్రం లేవని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ కార్డుల కోసం 230 మంది దరఖాస్తు చేసుకుంటే 67 మంది పేర్లే రావడంతో ఆందోళనకు దిగారు. బాన్సువాడ మండలంలో నిరసనల మధ్య గ్రామ సభలు జరిగాయి. బాన్సువాడలోని 15వ వార్డులో జరిగిన సభలో బీఆర్‌ఎస్ నాయకులు, మున్సిపల్ వైస్ చైర్మన్ వివిధ పథకాలపై ఎమ్మెల్యే పోచారంను ప్రశ్నించారు. దీంతో ఆయన రాజకీయం చేయడానికి వచ్చారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నస్రుల్లాబాద్ మండలం మిర్జాపూర్‌లో పథకాల జాబితాలో పేర్లు లేవని ప్రజలు అడుగుతుండగానే అధికారులు మెల్లిగా జారుకున్నారు. రేషన్‌కార్డుల అర్హుల జాబితాలో పేరు లేకపోవడంతో బీబీపేట మండలం యాడారం గ్రామసభలో ఓ వ్యక్తి భిక్షాటన చేసి నిరసన తెలిపాడు. మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌లో తమకు రుణమాఫీ కాలేదని కొందరు రైతులు నిరసన తెలిపారు. లక్ష్మీరావులపల్లిలో ఇళ్లు ఉన్నవారి పేర్లే మళ్లీ ఇందిరమ్మ అర్హుల జాబితాలో ఉన్నాయని గ్రామస్తులు ఆరోపించారు. ఇలా చాలాచోట్ల నిరసనల మధ్య గ్రామసభలు జరిగాయి. రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా జాబితాల్లో పేర్లు లేవంటూ పలువురు గొడవకు దిగారు. అర్హులందరికీ పథకాలు అందుతాయని, జాబితాలో పేరు లేనివారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలంటూ అధికారులు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు.

సభల్లో పోచారం, షబ్బీర్, అధికారులు..

జిల్లాలో గురువారం జరిగిన ప్రజాపాలన సభల్లో ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. బాన్సువాడ పట్టణంలో వార్డు సభలో పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, కామారెడ్డి పట్టణంలోని 47వ వార్డులో జరిగిన సభలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ పాల్గొని అర్హులందరికీ పథకాలు అందేలా చూస్తామన్నారు. గాంధారి మండలం మాధవపల్లి గ్రామ సభలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొని అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యత ఉంటుందని భరోసా ఇచ్చారు. మాచారెడ్డి మండలం కొత్తపల్లి, అక్కాపూర్ గ్రామాల్లో జరిగిన ప్రజాపాలన సభల్లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కామారెడ్డి మండలం నర్సన్నపల్లి, తాడ్వాయి మండలం సంతాయిపేట గ్రామాల్లో జరిగిన సభల్లో అదనపు కలెక్టర్ విక్టర్ పాల్గొన్నారు. పెద్దకొడప్‌గల్ మండలం లింగంపల్లి, జుక్కల్ మండలం బంగారుపల్లి గ్రామాల్లో జరిగిన సభల్లో బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి పాల్గొని మాట్లాడారు.



లింగంపేట : రేషన్‌కార్డు అర్హుల జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవని నిలదీస్తున్న మహిళలు

కమ్మేసిన పొగమంచు



కామారెడ్డి వీక్లీమార్కెట్ రోడ్‌లో ఉ॥8:32 గంటలకు

కామారెడ్డి టౌన్/భిక్కనూరు: జిల్లాలో చలి తీవ్రత కొనసాగుతోంది. ఉదయం 9 గంటల వరకు మంచు కురుస్తూనే ఉంది. దట్టంగా కమ్ముకున్న మంచుతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



భిక్కనూరులో..

రేషన్‌కార్డు కోసం భిక్షాటన

గ్రామసభలో యువకుడి నిరసన

బీబీపేట: యాడారం గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో గ్రామానికి చెందిన ముస్తాబాద్ అనిల్ గౌడ్ అనే యువకుడు రేషన్ కార్డు కోసం భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఇప్పటికే మూడు సార్లు రేషన్ కార్డు కోసం దరఖాస్తు పెట్టుకున్నప్పటికీ రాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారుల పొరపాటు వల్లే తనకు అన్యాయం జరిగిందని ఆరోపించాడు. ప్రజాపాలన, మీ సేవ కేంద్రాలలో దరఖాస్తులు చేసుకొని పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరగినా కానీ ఎవరూ పట్టించుకోవడం లేదన్నాడు. కోళ్ల ఫారాల్లో పని చేస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన 49 మందికి రేషన్ కార్డులు వస్తున్నాయని, గ్రామానికి చెందిన వ్యక్తులకు రేషన్ కార్డులు ఇవ్వడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారని అనిల్ గౌడ్ పేర్కొన్నాడు. గ్రామంలో చాలా మంది 60 ఏళ్లుగా పూరి గుడిసెలో నివసిస్తున్నారని, వారికి సైతం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయలేదన్నాడు. అనర్హుల పేర్లు వస్తే ఫిర్యాదు చేయాలని ఎంపీడీవో సూచించడంతో ప్రజలు మండిపడ్డారు. అధికారులు తప్పు చేస్తే ప్రజలు ఎలా ఫిర్యాదు చేస్తారని, రీ సర్వే చేసి అసలైన లబ్ధిదారులకు పథకాలు అందేలా చూడాలని కోరారు.



యాడారం గ్రామసభలో భిక్షాటన చేస్తున్న గ్రామస్తుడు

ఆత్మలూ అర్హులే!

భిక్కనూరు: మండలంలోని కంచర్ల గ్రామానికి చెందిన రామవ్వ ఆరు నెలల క్రితం చనిపోయింది. అదే గ్రామానికి చెందిన లింగం ఐదు నెలల క్రితం, శంకరయ్య నాలుగు నెలల క్రితం మరణించారు. అయితే ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాలో వీరి పేర్లుండడం గమనార్హం. గురువారం కంచర్లలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు 180 కుటుంబాలు అర్హత కలిగి ఉన్నాయని అధికారులు తెలిపారు. ఇందులో చనిపోయిన ముగ్గురు వ్యక్తుల పేర్లున్నాయి. దీనిపై గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పథకాల అమలు కోసం ఇటీవల ఇంటింటికి వెళ్లి సర్వే చేసిన అధికారులు.. ఇళ్లు లేని పేదలు ఎంతోమంది ఉన్నా వారిని కాదని, అర్హుల జాబితాలో మృతుల పేర్లు ఎలా నమోదు చేశారని ప్రజలు అవాక్కవుతున్నారు.

బిచ్కుంద గ్రామసభలో తోపులాట

బిచ్కుంద: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం జరిగిన గ్రామ సభలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య గొడవ జరిగింది. ప్రజాపాలనలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఇప్పుడు రేషన్ కార్డుల జాబితా ఎన్ని పేర్లు వచ్చాయో తెలపాలని బీఆర్‌ఎస్ నాయకులు అధికారులను ప్రశ్నించారు. జాబితాలో ఉన్న పేర్లను చదువుతామని అధికారులు చెప్పగా.. రేషన్‌కార్డులపై సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. లేకపోతే సభను బహిష్కరించాలని డిమాండ్ చేశారు. దీంతో కాంగ్రెస్ నాయకులు కలగజేసుకొని పదేళ్లలో గత ప్రభుత్వం ఒక్క కార్డు కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పుడు ప్రభుత్వం రేషన్‌కార్డులు ఇస్తోందని పేర్కొన్నారు.

ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య మాటామాటా పెరిగింది. ఇరు వర్గాలు తోపులాటకు దిగడంతో ఎస్సై మోహన్ రెడ్డి, పోలీసులు వారిని సముదాయించారు. అనంతరం గ్రామ సభ కొనసాగింది.



కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులను సముదాయిస్తున్న పోలీసులు

క్లుప్తంగా

గత ప్రభుత్వ వైఫల్యంతోనే సమస్యలు

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



బిచ్కుంద/నిజాంసాగర్(జుక్కల్): పదేళ్లు పాలించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యం కారణంగా నిరుపేదలకు రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలు దూరమయ్యాని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆరోపించారు. గురువారం బిచ్కుంద మండలం శాంతాపూర్, పిట్లం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామసభలలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని గుర్తు చేశారు. రేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ అని అన్నారు. జాబితాలో పేరు లేని మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం సీతారాంపల్లిలో నిర్మించిన సొసైటీ గోదామును ప్రారంభించారు.

ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య, వైద్యులు రోహిత్ కుమార్ గౌడ్, ఉమాకాంత్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా మెగా జాబ్‌మేళా



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్‌కే డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన మెగా జాబ్‌మేళా విజయవంతమైంది. ప్రముఖ కంపెనీలు విప్రో, జెన్‌పాక్ట్, టెక్ మహీంద్రా, క్యామెల్ క్యూ ఐటీ కంపెనీలు ఉద్యోగాల భర్తీ కోసం ఇంటర్వ్యూలను నిర్వహించాయి. జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి 300 మందికి పైగా అభ్యర్థులు ఈ మేళాకు హాజరుకాగా 130 మందికి పైగా అభ్యర్థులను ఉద్యోగాల కోసం ఎంపిక చేశారు. ముఖ్య అతిథులుగా తెయూ సైన్స్ డీన్ ఆరతి, ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి షేక్‌సలాంలు హాజరయ్యారు. కళాశాల కరస్పాండెంట్, సీఈవో జైపాల్ రెడ్డి, ప్రిన్సిపల్‌లు సైదయ్య, దత్తాత్రి, నవీన్, గోవర్ధన్, గంగాధర్, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు ద్విచక్ర వాహనాల వేలం

ఆర్మూర్‌టౌన్: వివిధ కేసుల్లో సీజ్ చేసిన రెండు ద్విచక్ర వాహనాలను ఈనెల 25వ తేదీన మామిడిపల్లిలోని ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ స్టీవెన్‌సన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11గంటల వేలం ప్రారంభమవుతుందని, పాల్గొనాలనుకునే వారు 25శాతం డిపాజిట్ జమ చేయాలని సూచించారు.

డాటా ఎంట్రీని వేగంగా చేపట్టాలి

- పకడ్బందీగా వివరాలు నమోదు చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన డాటా ఎంట్రీని వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. గురువారం ఆయన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వ్యవసాయ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శుక్రవారంతో గ్రామ సభలు ముగుస్తాయన్నారు. ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయా పథకాలను ప్రారంభించనున్నారన్నారు. సభలకు సంబంధించిన డాటాను పకడ్బందీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో సమస్యలు తలెత్తకుండా గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తున్నందుకు యంత్రాంగాన్ని కలెక్టర్ అభినందించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ సీఈవో చందర్, డీఆర్డీవో సురేందర్, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిరుపేదలకే ప్రథమ ప్రాధాన్యత



గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

గాంధారి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో నిరుపేదలకే మొదటి ప్రాధాన్యత ఉంటుందని కలెక్టర్ ఆశిష్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. గురువారం మాధవపల్లిలో జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శి సంక్షేమ పథకాల అర్హుల జాబితాలను చదివి వినిపించగా.. కొందరు గ్రామస్తులు అభ్యంతరాలు తెలిపారు. అధికారులు వారికి సర్దిచెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సభలో చదివిన జాబితాలు కేవలం పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నవారివే అన్నారు. లబ్ధిదారుల ఎంపిక నిరంతరంగా సాగుతుందన్నారు. జాబితాల్లో అనర్హులుంటే అధికారులకు తెలియజేయాలన్నారు. అర్హులైన వారి పేర్లు జాబితాలో లేకపోతే గ్రామ సభ వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్లలో దరఖాస్తు ఇవ్వాలన్నారు. గ్రామసభలో వీలు కాని వారు శనివారం లోపు తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. గ్రామంలో తాగు నీటి సమస్యల ఉందని, పైపు లైన్ మొత్తం పాడైపోయిందని గ్రామస్తులు కలెక్టర్‌తో పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘానికి భవనం మంజూరు చేయాలని సమాఖ్య అధ్యక్షురాలు తస్లీమా కలెక్టర్‌ను కోరారు. తమకు పింఛన్లు రావడం లేదని పలువురు వృద్ధులు పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో రాజేశ్వర్‌ను కలెక్టర్ ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారి లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ సతీష్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వర్, ఏవో రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

నిరంతరంగా పథకాలు అమలు చేస్తాం



49వ వార్డులో దరఖాస్తులను స్వీకరిస్తున్న షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో అర్హులైన వారికి నిరంతరంగా ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 49వ వార్డులో జరిగిన ప్రజాపాలన వార్డు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయని విమర్శించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, కమిషనర్ స్పందన, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి పనులు ప్రారంభించాలని..

దోమకొండ: మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా మారుస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేసిందని, వెంటనే పనులను ప్రారంభించాలని కోరుతూ గురువారం మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు షబ్బీర్‌అలీకి వినతిపత్రం అందజేశారు. మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి స్వామి, తదితరులు ఉన్నారు.

స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయండి

కామారెడ్డి టౌన్: పెండింగ్ స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్య ప్రతినిధులు గురువారం జిల్లా కేంద్రంలో షబ్బీర్ అలీని కలిసి కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. సీఎంతో చర్చించి నిధులు విడుదల చేయించాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న ప్రయివేట్ పాఠశాలల యజమానులు, ప్రతినిధులు

'ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాను'

కామారెడ్డి టౌన్: ఇరవై మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నానని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. జిల్లా కేంద్రంలోని సుభాష్‌రోడ్‌లో 23 ఏళ్ల క్రితం ఆయన రాష్ట్ర మంత్రిగా ఉన్నప్పుడు నిర్మించిన మాంసం విక్రయ సముదాయ దుకాణాలకు సంబంధించి 32 మందికి గురువారం కేటాయింపు పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తాను నిర్మించిన దుకాణాలను ఇప్పుడు తన చేతుల మీదుగా కేటాయిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. డీసీసీ అధ్యక్షుడు కై లాస్ శ్రీనివాస్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, కమిషనర్ స్పందన, పండ్ల రాజు, కన్నయ్య పాల్గొన్నారు.

పట్టణవాసులకూ ఆత్మీయ భరోసా వర్తించేలా కృషి

- ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి



మాట్లాడుతున్న పోచారం, పక్కన కాసుల బాల్‌రాజ్, సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ: పట్టణవాసులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తించేలా సీఎం దృష్టికి తీసుకెళ్తున్నామని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని 13, 15 వార్డుల్లో సభలు నిర్వహించారు. వార్డు సభలకు ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, సబ్ కలెక్టర్ కిరణ్మయితో కలిసి పోచారం హాజరయ్యారు. జాబితాలో పేర్లు లేని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని, ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో 19,176 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, 335 ఎకరాల వ్యవసాయేతర భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారని తెలిపారు. ఈ నెల 26 నుంచి వ్యవసాయ భూములకు రైతు భరోసా కింద ఏడాదికి ఎకరానికి రూ.12 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, ఖలేక్, ఎజాస్, నార్ల సురేష్, నార్ల రవీందర్, తదితరులున్నారు.

అర్హులైన వారందరికి పథకాలు



సంతాయిపేట్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి రూరల్/తాడ్వాయి: అర్హులైన పేదలందరికి ప్రభుత్వ పథకాలు అందజేస్తామని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. గురువారం కామారెడ్డి మండలం నర్సన్నపల్లి, తాడ్వాయి మండలంలోని సంతాయిపేట్ గ్రామ సభలలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారికి పథకాలు అమలు కోసం గ్రామసభలో జాబితాలను చదివి వినిపిస్తామని, వాటిలో ఏమైనా అభ్యంతరాలుంటే గ్రామ సభలో తెలపాలన్నారు. దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీఓ రంగనాథ్ రావు, తహసీల్దార్ జానార్దన్, ఎంపీడీవో నాగవర్ధన్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రితో ఎంపీ భేటీ

సుభాష్‌నగర్: కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో ఢిల్లీలోని తన కార్యాలయంలో ఎంపీ అర్వింద్ ధర్మపురి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా ఎన్నికైన పల్లె గంగారెడ్డికి కేంద్రమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. దశాబ్దాల కల సాకారమైనందుకు పసుపు రైతుల సంక్షేమానికి తోడ్పడాలని చైర్మన్‌కు మంత్రి సూచించారు. అలాగే పసుపు ఎగుమతులు, మార్కెటింగ్, పలు అంశాలపై వారు చర్చించారు. తనను జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా నియమించినందుకు పల్లె గంగారెడ్డి మంత్రికి ధన్యవాదాలు తెలిపి సన్మానించారు. వారి వెంట బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు మోరెపల్లి సత్యనారాయణ ఉన్నారు.

పరిస్థితి విషమించి ఒకరి మృతి

మాచారెడ్డి: భార్యాభర్తల కలహాలు నిండు ప్రాణాన్ని బలి తీసుకున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని ఎల్లంపేట గ్రామానికి చెందిన కుంచం ఎల్లయ్య కుమార్తె మమతను రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన బోదాసు స్వామికి ఇచ్చి 8 ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. వారికి ఇద్దరు పిల్లలు. కొన్నాళ్లుగా భార్యాభర్తల మధ్య కలహాలు చోటు చేసుకుంటుండడంతో ఈనెల 21న మాచారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా పెద్దల సమక్షంలో మాట్లాడుకుంటామని ఇరు వర్గాలు బయటికి వెళ్లారు. ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి వాదులాడుకున్నారు. కుంచం ఎల్లయ్యతోపాటు అతడి కుమారుడు నితిన్ మరికొంత మంది కలిసి స్వామిని, అతడి తండ్రి నర్సింలును కారులో ఎక్కమన్నారు. దానికి వారు నిరాకరించడంతో వెంబడించి చితక బాదారు. కారులో బలవంతంగా ఎక్కించుకుని వెళ్లి, చితక బాది ఎల్లంపేటలో వదిలిపెట్టారు. స్వామి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు ఎల్లయ్యతోపాటు అతడి కుమారుడు, మరి కొంత మందిపై కేసు నమోదు చేశారు. స్వామిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అదే రోజు హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. ఈ కేసులో ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ముగ్గురికి జైలు శిక్ష

డిచ్‌పల్లి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ముగ్గురు వ్యక్తులకు జిల్లా సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ గురువారం తీ ర్పునిచ్చినట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. ఈ నెల 21న రాత్రి వాహనాల తనిఖీ చేపట్టగా, అమృతాపూర్, సాంపల్లి, మోపాల్ మండలం బాడ్సి గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారన్నారు. ముగ్గురిని గురువారం జిల్లా సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా ఒక్కొక్కరికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

న్యూసెన్స్ చేసిన వ్యక్తికి ఒక రోజు..

బోధన్‌టౌన్(బోధన్): మద్యం మత్తులో డయల్ 100కి కాల్ చేసి పోలీసుల సమయాన్ని వృథా చేసి న్యూసెన్స్ చేసిన వ్యక్తికి బోధన్ కోర్టు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేషతల్పసాయి ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. పట్టణంలోని గోషాలకు చెందిన షేక్ ఫారూక్ మద్యం మత్తులో డయల్ 100కు పలుమార్లు ఫోన్ చేసి సమయాన్ని వృథా చేయడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని కో ర్టులో హాజరుపరిచినట్లు సీఐ వెంకటనారాయణ తె లిపారు.అలాగే బహిరంగ ప్రదేశంలో మద్యం సే వించిన ఇద్దరు వ్యక్తులను సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా ఒక రోజు కమ్యూనిటీ సర్వీస్ చేయాలని న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

స్కూటీ చోరీ కేసులో అరెస్ట్.. రిమాండ్



డిచ్‌పల్లి: ఈనెల 21వ తేదీన మండలంలోని ధర్మారం(బి) గ్రామానికి చెందిన దుబ్బాక సోమయ్య ఇంటి ఎదుట పార్క్ చేసిన స్కూటీని ఎత్తుకెళ్లిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ మల్లేశ్ ఆదేశాల మేరకు ఎస్సై-2 సత్యం సిబ్బందితో కలిసి నాగ్‌పూర్ గేటు వద్ద గురువారం వాహనాల తనిఖీ చేపట్టగా, బిచ్కుంద మండలం బండ రెంజల్ గ్రామానికి చెందిన మంగలి దత్తు అలియాస్ అవారా దత్తు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా స్కూటీని తానే దొంగిలించినట్లు అంగీకరించాడు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మల్లేశ్ తెలిపారు.

క్రైం కార్నర్

లారీ ఢీకొని ఒకరి మృతి

ఖలీల్‌వాడి: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందారు. నగరంలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అర్సపల్లి రైల్వే గేటు వద్ద గురువారం చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి ఎస్సై మహేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. అర్సపల్లికి చెందిన తరికంటి యాదయ్య(78) గ్రామశివారులోని వ్యవసాయభూమిలో పనులు పూర్తి చేసుకుని టీవీఎస్ ఎక్సెల్‌పై ఇంటికి వస్తుండగా రైల్వే గేటు మూలమలుపు వద్ద లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలై యాదయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు..



మహిపాల్ (ఫైల్)

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో మండల కేంద్రానికి చెందిన మున్నూరు మహిపాల్(40) అనే వ్యక్తి మృతి చెందాడు. గురువారం ఉదయం మహిపాల్ బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి కిందపడిపోయాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్ తెలిపారు.

చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కామారెడ్డి క్రైం: మున్సిపాలిటీ పరిధిలోని లింగాపూర్ చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం వెలుగు చూసింది. చెరువులో మృతదేహం ఉందని స్థానికులు సమాచారం ఇవ్వడంతో దేవునిపల్లి పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మృతదేహం పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉందని, 90526 72351నంబర్‌తో మొబైల్ ఫోన్ లభించిందని ఎస్సై రాజు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు.

అజాగ్రత్తగా డ్రైవింగ్.. ప్రయాణికుడికి గాయాలు

మాచారెడ్డి: ఆర్టీసీ బస్సును డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో ప్రయాణికుడికి గాయాలైన ఘటన మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సిద్దిపేట జిల్లా దుబ్బాకకు చెందిన రాంప్రసాద్ అనే యువకుడు గజ్యానాయక్ తండా చౌరస్తాలో గురువారం సిద్దిపేట డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సును ఆపేందుకు చేయి చూపాడు. డ్రైవర్ బస్సు ఆపినట్టే ఆపి స్పీడ్ పెంచడంతో రాంప్రసాద్ పాదం బస్సు వెనుక టైర్ కింద పడింది. కాలి వేళ్లు నుజ్జునుజ్జయ్యాయి. స్థానికులు వెంటనే బస్సును నిలిపివేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడిని 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ అజాగ్రత్త కారణంగానే ప్రమాదం జరిగిందని స్థానికులు పోలీసులకు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

మోపాల్: మండలకేంద్రంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డిచ్‌పల్లికి చెందిన జమీల్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు ఎస్‌హెచ్‌వో యాదగిరిగౌడ్ తెలిపారు. కంజర్ శివారులోని ఫిల్టర్ బెడ్‌లో విధులు నిర్వర్తించే జమీల్ మోపాల్ మండలకేంద్రంలో నడుచుకుంటూ వెళ్తుండగా పెట్రోల్ బంకు వద్ద వెనుక నుంచి వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టింది. జమీల్‌కు తీవ్రగాయాలుకాగా, బైక్‌పై ఉన్న కంజర్ గ్రామానికి చెందిన గంగాధర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. జమీల్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు



ఆర్మూర్‌టౌన్: గంజాయి విక్రేతలు ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఆర్మూర్ ఎక్సైజ్ సీఐ స్టీవెన్‌సన్ గురువారం తెలిపారు. అంకాపూర్ సమీపంలో ఎక్సైజ్‌శాఖ అధికారులు రూట్ వాచ్ నిర్వహిస్తున్న సమయంలో అంకాపూర్‌కు చెందిన నూనె శ్రీకాంత్, జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండకు చెందిన కిరణ్ ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. వారి నుంచి 1.6 కేజీల ఎండు గంజాయితోపాటు బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ నుంచి గంజాయి తీసుకువచ్చి చిన్నచిన్న ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నారన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. తనిఖీలో ఎస్సై చంద్రమౌళి, సిబ్బంది సాయిలు, దేవీదాస్, నరేశ్, సందీప్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దాస్‌నగర్ వద్ద ఒకరు..



మాక్లూర్: గంజాయి విక్రయిస్తున్న ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మండలంలోని దాస్‌నగర్ వద్ద గురువారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి తమను చూసి పారిపోయేందుకు యత్నించగా పట్టుకుని విచారించామన్నారు. నవీపేట మండలం కమలాపూర్‌కు చెందిన మెట్టుమల్ల శ్రీకాంత్‌గా అతడిని తనిఖీ చేయగా 110 గ్రాముల ఎండు గంజాయి లభించిందన్నారు. డబ్బు సంపాదించాలనే ఆశతో నాందెడ్ తదితర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు శ్రీకాంత్ ఒప్పుకున్నాడన్నారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

జిల్లా కేంద్రంలో..

ఖలీల్‌వాడి : గంజాయి సరఫరా చేస్తున్నాడనే సమాచారం మేరకు జిల్లా కేంద్రంలో జునైద్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని 700 గ్రాముల గంజాయిని ఎక్సై జ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.దాడిలో ఎక్సైజ్ సీఐ స్వప్న, ఎస్సై రాము, సిబ్బంది పాల్గొన్నారు.

పంటపొలాల్లో స్కూల్ బస్సు బోల్తా

- ఇద్దరు విద్యార్థులకు గాయాలు
- కమలాపూర్‌లో ఘటన



వరి మడిలో బోల్తాపడిన స్కూల్ బస్సు

నవీపేట: మండలంలోని కమలాపూర్ శివారులో గురువారం ఉదయం ప్రైవేట్ పాఠశాల బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని సాహితీ పాఠశాల బస్సు గురువారం నాడాపూర్‌కు చెందిన 30 మంది చిన్నారులను తీసుకుని కమలాపూర్ మీదుగా నవీపేటకు బయల్దేరింది. కమలాపూర్ శివారులోని అంకాలమ్మ పోలేరమ్మ ఆలయ సమీపంలోకి రాగానే రోడ్డు పక్కనే ఉన్న పంట పొలాల్లో బోల్తా పడింది. రెగ్యులర్ డ్రైవర్‌కు బదులు క్లీనర్ భోజన్న బస్సును అజాగ్రత్తగా నడపడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. ప్రమాదంలో నాడాపూర్‌కు చెందిన నాల్గో తరగతి విద్యార్థిని మీనాక్షి, యూకేజీ విద్యార్థిని నామాన్షిలకు స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరిని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫైనాన్స్ వేధింపులు తాళలేక ఆత్మహత్య



ప్రవీణ్‌గౌడ్ (ఫైల్)

బీబీపేట: ప్రైవేట్ ఫైనాన్స్ వేధింపులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని తుజాల్‌పూర్‌లో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన సుంకరి ప్రవీణ్‌గౌడ్ (32) ఇంటి నిర్మాణం కోసం ప్రైవేట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలో సుమారు రూ.3లక్షల లోన్ తీసుకున్నాడు. అలాగే బయటి వ్యక్తుల వద్ద మరి కొన్ని అప్పులు చేశాడు. ప్రతి నెలా ఫైనాన్స్ కిస్తులు చెల్లించడం కష్టంగా మారడం, కంపెనీ ప్రతినిధులు డబ్బుల కోసం ఒత్తిడి పెంచడంతో ప్రవీణ్‌గౌడ్ మనస్తాపానికి గురయ్యాడు. అప్పులు ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెందిన ప్రవీణ్‌గౌడ్ బుధవారం సాయంత్రం ఇంటి నుండి బయటికి వెళ్లి తన సోదరుడికి ఫోన్ చేశాడు. అప్పులు ఎక్కువయ్యాయని, ఆర్థిక ఇబ్బందులు తాళలేక చనిపోతున్నానని తెలిపి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. గురువారం ఉదయం గ్రామ శివారులోని చెట్టుకు ప్రవీణ్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పోచమ్మగల్లీకి చెందిన పాల్చి అభిలాష్(23) అనే యువకుడు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కూలీ పనులు చేసి జీవించే అభిలాష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

చెరువులో దూకి వివాహిత..



రేణుక(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఎర్రకుంటతండాకు చెందిన రేణుక(35) అనే మహిళ బుధవారం ఉదయం జప్తిజాన్కంపల్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం జయరాంతండాకు చెందిన దేవసోత్ ధన్‌సింగ్ కూతురు రేణుకను పదేళ్ల క్రితం నాగిరెడ్డిపేట మండలంలోని ఎర్రకుంటతండాకు చెందిన మలావత్ రామ్‌చంద్‌కు రెండో భార్యగా ఇచ్చి వివాహం చేశారు. కాగా రేణుకను భర్తతోపాటు అతడి మొదటి భార్య కొడుకు సూర్య, కోడలు గంగి మానసికంగా, శారీరకంగా వేధించడంతో గతేడాది అక్టోబర్ 26న తల్లిగారింటికి వెళ్లిపోయింది. పెద్దల సమక్షంలో ఒప్పించి గతేడాది డిసెంబర్ 30న రేణుకను రాంచందర్‌తో పంపించగా, బుధవారం గ్రామసమీపంలోని చెరువులో దూకి రేణుక ఆత్మహత్య చేసుకుంది. తన కూతురి మరణంపై భర్త రాంచందర్‌తోపాటు ఆయన మొదటి భార్య కొడుకు, కోడలిపై అనుమానాలు ఉన్నట్లు రేణుక తండ్రి ధన్‌సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.